క్లుప్తంగా

నీటిని విడుదల చేయాలని వినతి



గద్వాల : యాసంగిలో ఆయకట్టుకు జూరాల కుడి కాలువకు నీటిని విడుదల చేయాలని రైతాంగ సమితి జిల్లా ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలో జూరాల ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతాంగ సమితి జిల్లా అధ్యక్షుడు ఖాజా మాట్లాడారు. అధికారులు నెలాఖరు వరకు స్పష్టత ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రైతాంగ సమితి నాయకులు రాధకృష్ణారెడ్డి, సత్తన్న తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి



గద్వాల: ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని గురువారం జిల్లా కేంద్రంలోని పాత హౌసింగ్ కాలనీ నుంచి అంబేడ్కర్ చౌక్ వరకు ర్యాలీ చేపట్టారు. ర్యాలీకి బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, అతిఖుర్ రహ్మాన్‌లు మద్దతు తెలిపారు. వారు మాట్లాడుతూ.. డ్రైవర్ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. ఫిబ్రవరి 6న డ్రైవర్ల దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో యూసుఫ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఒకే సమయంలో మూడు రోడ్డు ప్రమాదాలు

గోపాల్‌పేట: మండలంలో గురువారం ఒకే సమయంలో మూడు రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గురువారం సాయంత్రం నాలుగున్నరకు వనపర్తికి చెందిన గోపి గోపాల్‌పేట నుంచి జిల్లా కేంద్రానికి వెళ్తుండగా నర్సింగాయపల్లికి సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడిపోయాడు. అదే సమయంలో గోపాల్‌పేటకు చెందిన చిన్నబాలి అనే వ్యక్తి వనపర్తి నుంచి స్వగ్రామానికి వస్తుండగా అక్కడే ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడగా వెనక నుంచి వచ్చిన ఓ గుర్తుతెలియని వాహనం చిన్నబాలి చేతిపై నుంచి వెళ్లింది. దీంతో చిన్నబాలి చేతికి పెద్ద గాయమైంది. స్థానికులు గుర్తించి వారిని వనపర్తి ఆస్పత్రికి తరలించారు. అయితే ఈ ప్రమాదం జరిగిన పది నిమిషాల వ్యవధిలోనే గోపాల్‌పేట పోలీస్‌స్టేషన్ ఎదుట వనపర్తికి చెందిన మణ్యం ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడిపోయాడు. అయితే గోపి, మన్యం మద్యం మత్తులో ఉన్నట్లు తెలిసింది. ప్రమాదాలపై గోపాల్‌పేట ఎస్‌ఐని వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

సన్నరకం వడ్లు కాంటా చేయరా ?



పాన్‌గల్: మద్దతు ధర, బోనస్ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోనే ధాన్యం విక్రయించాలని అధికారులు, ప్రజాప్రతినిధులు చెబుతున్నా క్షేత్ర స్థాయిలో మాత్రం రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. మండల కేంద్రానికి చెందిన రైతు లింగాల రాములు తాను పండించిన సన్న వడ్లను కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చి నెల రోజులు అవుతున్నా.. నేటికీ కొనుగోలు చేయకపోవడంతో కేంద్రంలో పడిగాపులు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. బోనస్ వస్తుందనే ఉద్దేశ్యంతో కేంద్రానికి ధాన్యం తీసుకొస్తే కేంద్రం నిర్వాహకులు కాంటా చేయడంలో జాప్యం చేస్తున్నారని వాపోయాడు. కేంద్రానికి ధాన్యం తీసుకురాకపోయిన బాగుండేదని, ప్రైవేట్ వ్యాపారులు ధాన్యం కొంటామని, వచ్చిన వారికి అమ్మకుండా కేంద్రానికి తీసుకొస్తే జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ధాన్యం వెంటనే కాంటా చేయాలన్నారు.

విద్యార్థుల ప్రతిభ

కొత్తకోట రూరల్: జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో ఈనెల 6న నిర్వహించిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థాయి అండర్–14 బాలురు, బాలికల హాకీ క్రీడాకారుల ఎంపికలో పెద్దమందడి ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న ఆర్.రేవతి, ఆర్.అంజలి, 9వ తరగతి చదువుతున్న శివశంకర్ పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు శాంతన్న, ఫిజికల్ డైరెక్టర్ మన్యం యాదవ్ తెలిపారు. నవంబర్ 29 నుంచి డిసెంబర్ 1 వరకు కరీంనగర్ జిల్లా హుజురాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి హాకీ పోటీలో వీరు పాల్గొంటారన్నారు.

యువత ఆదర్శంగా తీసుకోవాలి



అలంపూర్‌లో పూలేకు నివాళులర్పిస్తున్న నాయకులు

గద్వాల(గట్టు): మహాత్మా జ్యోతిబా పూలేను యువత ఆదర్శంగా తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కర్రెప్ప అన్నారు. ఆయన వర్ధంతి కార్యక్రమంలో గట్టు గ్రామ పంచాయతీలో గురువారం కేవీపీఎస్, సీఐటీయూ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కర్రెప్ప మాట్లాడుతూ.. పూలే చూపిన మార్గంలో నేటి యువత ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర నాయకుడు గట్టు మారెన్న, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వీవీ నర్సింహా, కేవీపీఎస్ సహాయ కార్యదర్శి ఆంజనేయులు, భీమన్న, బజారన్న, తాయన్న, నారాయణ, తిమ్మప్ప, ఈరన్న తదితరులు పాల్గొన్నారు. జ్యోతిబా పూలే వర్ధంతిని పురస్కరించుకుని గురువారం జిల్లా కేంద్రంలోని వివిధ సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు ఘనంగా నివాళులర్పించారు. జిల్లా కేంద్రంలోని క్రిష్ణవేణి చౌరస్తాలోని జ్యోతిబా పూలే విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు, రజక సంఘం నాయకులు, తెలుగు ముదిరాజ్ సంఘం, తెలుగు ముదిరాజ్ మత్స్యకార సంఘాలతో పాటు వివిధ ప్రజాసంఘాల నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం, బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర నాయకుడు కురువ విజయ్‌కుమార్ పూలే చిత్రపటానికి నివాళులర్పించారు.

అయిజ: మండల కేంద్రంలో గురువారం మహాత్మ జ్యోతిబా పూలే 134వ వర్ధంతి కార్యక్రమం వివిధ సంఘాలు, పార్టీల నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అసమానతలు లేని సమాజమే లక్ష్యం

అలంపూర్: అసమానతలు లేని సమాజ నిర్మాణమే మహాత్మాజ్యోతిబా పూలే లక్ష్యమని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు అన్నారు. అలంపూర్ పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మహాత్మా జ్యోతిబాపూలే 134వ వర్ధంతిని కేవీపీఎస్, సమ సమాజ సేవా ట్రస్ట్ అధ్వర్యంలో గురువారం నిర్వహించారు. కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహాత్మాజ్యోతిబా పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ....వివిధ సామాజిక సమస్యలతో పాటు రైతు, కార్మిక సమస్యలపై మహాత్మా పూలే పోరాడారన్నారు. అట్టడుగు వర్గాల ప్రజలను ఐక్యం చేసి ఉద్యమాలు నిర్మించారన్నారు. 1848లో మహిళల కోసం పాఠశాలలు స్థాపించారన్నారు. సతీసహగమనం వ్యతిరేకించిన గొప్ప సంఘ సంస్కర్త అని పేర్కొన్నారు. కార్యక్రమంలో సమ సమాజ సేవా ట్రస్ట్ డైరెక్టర్లు వెంకట్రామయ్య శెట్టి, నందు అధ్యాపకులు రాజు, ఆశన్న, నరసింహ్మా, వెంకటస్వామి, నాగరాజు, అయ్యప్ప, మౌలాలి, గంగన్న, శ్రీను, మాలిక్ బాష, రఫి, మద్దిలేటి రవి తదితరులు పాల్గొన్నారు.



గట్టులో మహాత్మా జ్యోతిబా పూలేకు నివాళులర్పిస్తున్న నాయకులు



అయిజలో పూలే వర్ధంతి కార్యక్రమంలో నాయకులు



జిల్లా కేంద్రంలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

‘కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం’



అలంపూర్‌లో సమావేశంలో మాట్లాడుతున్న మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ దొడ్డన్న

అలంపూర్: రాష్ట్రంలో కాంగ్రెస్‌తోనే రైతుల అభివృద్ధి సాధ్యమని వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ దొడ్డన్న, వైస్ చైర్మన్ పచ్చర్ల కుమార్ అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులు పండించిన పంటకు మద్దతు ధర కల్పిస్తుందన్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వార గేదెలు, కోళ్ల షెడ్ల కోసం నిధులు కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు 26,540 క్వింటాళ్ల పత్తిని సీసీఐ ద్వార రైతుల నుంచి కొనుగోలు చేసినట్లు తెలిపారు. రైతు సంక్షేమానికి కృషి చేస్తున్న కాంగ్రెస్ ఏడాది పాలనపై మూడు రోజుల రైతు సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లా కేంద్రంలో జరుగుతున్న రైతు సదస్సుకు చివరి సీఎం రేవంత్ రెడ్డి హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో మార్కెట్ యార్డ్ కార్యదర్శి ఎల్లస్వామి, డైరెక్టర్ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే



అంబేద్కర్ చౌక్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

గద్వాల : ఫుడ్ పాయిజన్‌తో వాంకిడి గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థిని మృతి చెందిందని ఇదీ ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని బీఆర్ఎస్వీ జిల్లా కో ఆర్డినేటర్ కుర్వ పల్లయ్య ఆరోపించారు. ఫుడ్ పాయిజన్ సంఘటలపై సంక్షేమ భవన్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ తోపాటు నాయకులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్వీ నాయకులు గురువారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పల్లయ్య మాట్లాడుతూ.. మాగనూరులో మూడుసార్లు ఫుడ్ పాయిజన్ కావడం ప్రభుత్వ నిర్లక్ష్యమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 11నెలల్లో 48 మంది విద్యార్థులు చనిపోయారని ఆరోపించారు. విద్యా వ్యవస్థపై, విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటం చేసే బీఆర్ఎస్వీ నాయకులను అరెస్టు చేయడం అప్రజాస్వామికమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు భరత్‌బాబు, ఖాజావలి, మాధవ్, ఓంకార్, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

కమనీయం వీరభద్రేశ్వరస్వామి కల్యాణం



వివాహ వేడుకలో పాల్గొన్న భక్తులు

గద్వాల: కార్తీక బహుళ త్రయోదశి పర్వదినాన్ని పురస్కరించుకొని రాజవీధిలోని వీరభద్రస్వామి ఆలయంలో భద్రకాళి వీరభద్రేశ్వరస్వామి కళ్యాణోత్సవాన్ని పండితులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. గురువారం ఉదయం మహిళలు దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామివారికి అభిషేకార్చనలు, రుద్రహోమం తదితర క్రతువులు చేశారు. ఆలయం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపం వద్దకు స్వామివారి, అమ్మవారి ఉత్సవ మూర్తులను ఆలయ నిర్వాహకులు తీసుకొచ్చారు. కళ్యాణ వస్త్రాలు సమర్పించి భక్తుల సందోహం నడుమ కల్యాణ వేడుకలు జరిపించారు. నందికోల సేవ, రథోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం పట్టణ పుర వీధుల గుండా ఊరేగింపు కార్యక్రమం చేపట్టారు. అనంతరం వీరశైవ సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వీరశైవ సంఘం, వీరశైవ మహిళా సమాజం సభ్యులు, వీరశైవ యువ సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శబరిమలకు అయ్యప్ప మాలధారులు



ఉండవెల్లిలోని ఆలయంలో ఇరుముడులు కడుతున్న గురుస్వాములు



అలంపూర్‌లో పడిపూజ పాల్గొన్న భక్తులు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో 32 మంది అయ్యప్ప మాలాధారులు గురుస్వామి ఆధ్వర్యంలో ఇరుముడులు ధరించి శబరిమలకు బయలుదేరారు. గురువారం అయ్యప్ప స్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు ఆంజనేయ శర్మ, ఆలయ ధర్మకర్త దామోదర్ రెడ్డి, గురుస్వాములు సూర్యకాంతారెడ్డి, రాముడు, మాలాదారులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ..

అలంపూర్ రూరల్: అలంపూర్ మండల పరిధిలోని కోనేర్ గ్రామంలో గురువారం అయ్యప్ప పడిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప స్వామి అష్టోత్తరం, హరిహసనం, పవలింపు సేవలు చేశారు. అయ్యప్ప స్వాములు ఆడిన పెటతుల్లి ఆకట్టుకుంది. అనంతరం స్వాములకు బిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో స్వాములు ఆనంద్, విజయ్ , శశిధర్, రామ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిశిలా క్షేత్రంలో ప్రత్యేక పూజలు



రామ్మోహన్‌స్వామిని సన్మానిస్తున్న ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు

గద్వాల : ఆదిశిలా క్షేత్రం స్వయంభూ శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం నంద్యాల జిల్లా సంజామాల గ్రామ లక్ష్మీనరసింహస్వామి ఉపాసకులు రామ్మోహన్ స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ స్వామి ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అర్చకులు స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, ఆలయ విశిష్టతలు వివరించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు మధుసూధనాచారి, రవిచారి, చంద్రశేఖర్ రెడ్డి, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పల్లకీ సేవ



ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ఊరేగిస్తున్న భక్తులు

అయిజ: మండలంలోని ఉత్తనూరు గ్రామంలో వెలసిన ధన్వంతరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం ఆలయ అర్చకులు స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ఊరేగించారు. పల్లకీ సేవలో వివిధ గ్రామాల భక్తులు తరలివచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలతోపాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్వామివారి నామ స్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.

ఘనంగా ప్రజాపాలన విజయోత్సవాలు



ప్రజాపాలనపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఇటిక్యాల: మండల కేంద్రంతో పాటు షాబాద్, ఉదండపూర్ గ్రామాల్లో గురువారం ప్రజాపాలన విజయోత్సవాలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సాంస్కృతిక కళాకారులు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలపై పాటల రూపంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నరేందర్ మాట్లాడుతూ.. ఈ నెల 19 నుంచి వచ్చే నెల 7వ తేదీ వరకు ప్రజాపాలన విజయోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో తెలంగాణ సాంస్కృతిక కళాకరులచే ఇట్టి కార్యక్రమాలు నిర్వహించి పథకాలపై ప్రజలకు వివరించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ భీమ్‌సేన్ రావు, పోలీసు సిబ్బంది, తెలంగాణ సాంస్కృతిక కళాకారులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ ప్రారంభించిన ఎమ్మెల్యే

- ఇరు వర్గాల మధ్య వాగ్వాదం



పైప్‌లైన్ ప్రారంభించిన ఎమ్మెల్యే విజయుడు



వాగ్వాదంలో నాయకులు

అయిజ: మున్సిపాలిటీలోని పెద్దవాగుపై బ్రిడ్జిని ఆనుకుని నిర్మించిన మిషన్ భగీరథ పైప్‌లైన్‌ను గురువారం అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 15 ఫైనాన్స్ టైడ్ గ్రాంట్స్ ద్వారా రూ. 18 లక్షలతో పైప్‌లైన్ నిర్మించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్నపై 8వ వార్డు కౌన్సిలర్ సరళ పావని భర్త వెంకటేశ్వర్లు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. 7, 8, 17వ వార్డుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం లేదని ఆరోపించారు. అక్కడే ఉన్న మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న తనపై చేసిన ఆరోపనణపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఎస్సీ కాలనీని అభివృద్ధి చేసేందుకు డబ్బు ఖర్చు పెట్టినట్లు తెలిపారు. అయితే మా వార్డును ఎందుకు అభివృద్ధి చేయడంలేదని వెంకటేశ్వర్లు ప్రశ్నించారు. ఒకరిపై మరొకరు తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేసుకున్నారు. సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ రాజయ్య, ఏఈ రాజశేఖర్, వివిధ వార్డుల కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు వావిలాల రంగారెడ్డి, ఎక్లాస్‌పురం నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు, నాయకులు

గద్వాల: గ్రామ పంచాయితీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న 10 నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి జమ్మిచేడు కార్తీక్, బీఆర్ఎస్ నాయకుడు గంజిపేట రాజు, బహుజన సేన జిల్లా అధ్యక్షుడు దానయ్య డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టీయూ అనుబంధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ పంచాయితీ కార్మిలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు వేతనాలను పెంచాలన్నారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, ప్రతి కార్మికుడికి రూ.2లక్షల జీవిత బీమా అమలు చేయాలన్నారు. అక్రమంగా తొలగించిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని తదితర సమస్యలు వెంటనే పరిష్కరించాలని పేర్కొన్నారు.

అధికారంలోకి వచ్చాక కోతలు



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి

గద్వాలటౌన్: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేందుకు ఎన్నికల్లో హామీలు గుప్పించి.. గద్దెనెక్కాక సంక్షేమ పథకాల్లో కోతలు విధించడం కాంగ్రెస్ విధానమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ఆరోపించారు. గురువారం స్థానిక డీకే బంగ్లాలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలు, 66 వైఫల్యాలపై బీజేపీ పోరుబాట చేపట్టనున్నట్లు తెలిపారు. డిసెంబర్ 1 నుంచి 5వ తేదీ వరకు ప్రభుత్వ వైఫల్యాలపై వివిధ పద్ధతుల్లో నిరసన కార్యక్రమాలు చేపడుతామన్నారు. మొత్తం అభివృద్ధిని పది నెలల్లో చేసి చూపించామని సీఎం, మంత్రులు పేర్కొనడం సిగ్గుచేటన్నారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చే వరకు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉద్యమం సాగిస్తామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమాలలో భాగంగా డిసెంబర్ 5వ తేదీన అలంపూర్‌లో, 7వ తేదీన గద్వాలలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపీ డీకే అరుణ ముఖ్య అతిథిగా హజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు విద్యాసాగర్, డీకే స్నిగ్ధారెడ్డి, రవికుమార్, బండల పద్మావతి, శివారెడ్డి, కేకే రెడ్డి, రామంజనేయులు, బండల వెంకట్రాములు, దేవదాసు, రాజశేఖర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

అర్థమయ్యే రీతిలో బోధించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి ప్రియాంక

గద్వాల(మల్దకల్) : విద్యార్థులకు సులభతరంగా అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించాలని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి డాక్టర్ ప్రియాంక ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం మండలంలోని బిజ్వారం హైస్కూల్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని మంచి ఉత్తీర్ణత సాధించాలన్నారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడంతో పాటు ఆరోగ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆయా పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మహేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సందెరాళ్ల పోటీలు ప్రారంభం



గద్వాల(ధరూర్): మండల పరిధిలోని ఓబులోనిపల్లి గ్రామంలో దాసరిపల్లి సవారమ్మ జాతర సందర్భంగా గ్రామంలో సందెరాళ్ల పోటీలు నిర్వహించారు. ఎమ్మెల్యే తనయుడు బండ్ల సాయిసాకేత్ రెడ్డి హాజరై కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. కార్యక్రమంలో ధరూర్ మండల మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, నాగన్న, విజయ్‌సింహ రెడ్డి, నవీన్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదం అంచున ప్రయాణం



ఉండవెల్లి: మండలంలోని ఉండవెల్లి శివారులోని జాతీయ రహదారి పక్కన కొన్నేళ్లుగా గుంత తవ్వి అలాగే వదిలేశారు. దీంతో జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వారం రోజుల క్రితం లారీ బోల్తా పడింది. గుంతను పూడ్చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

మానవపాడు: మండలంలో విధులు నిర్వహిస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని మండల వనరుల కేంద్రంలో గురువారం ఎంఐఎస్ కోఆర్డినేటర్ వీరేష్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులకు తక్షణమే పే స్కేల్ అమలు చేయాలని మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ కృషితో అందుబాటులోకి

మానవపాడు: మండల కేంద్రంలోని తిరుమాల తిరుపతి కళ్యాణ మండపం టీటీడీ కృషితో అందుబాటులోకి వచ్చిందని గ్రామ పెద్దలు పోషిరెడ్డి, దామోధర్‌రెడ్డి, రఘురెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, గోల్లవెంకట్రాడు, నారాయణరెడ్డి అన్నారు. గురువారం వారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మండపం కొన్ని సంవత్సరాలుగా వాడుకలో లేదని టీటీడీ దేవస్థాన కృషితో అందుబాటులోకి తీసుకురావడంపై హర్షం వ్యక్తం చేశారు. మండపంలో పలు కార్యక్రమాలు నిర్వహించాలనుకునే వారు. టీటీడీ దేవస్థానం పేరుతో డీడీ చెల్లించి కార్యక్రమాలు నిర్వహించుకోవచ్చని టీటీడీ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, నిర్వాహకులు పాల్గొన్నారు.